Postal regd: GTR/115/2025-27

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక

అమరావతి సంపుటి (Vol) : 11 సంచిక (Issue) : 56 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 (Andhra Pradesh Capital's First Telugu Weekly)

గురువారం, 28 - 5 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI : APTEL/2015/66622 Postal regd: GTR/115/2025-27 స్థాపితం : 2015

Place your advertisements on website

https://rajadhanivartalu.com

call us at whatsapp

94406 62699

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com

94406 62699

# ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ

**- ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సంజీవని కార్యక్రమం - ప్రజారోగ్యానికి సంజీవని ప్రాజెక్టు - ఆరోగ్యంగా ఉన్న ప్రజలే సమాజానికి నిజమైన సంపద - గొడ్డలి పార్టీ సమాజానికి హానికరం- నెవర్ అగైన్ - నోరు తెరిస్తే అబద్ధం-మీడియా ముందు మంచోడిగా డ్రామాలు - పూతలపట్టులో సంజీవని కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**









**పూతలపట్టు/చిత్తూరు జిల్లా, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దీనికోసం రాష్ట్రంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా సంజీవని కార్యక్రమం అమలు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి సంజీవని ప్రాజెక్టు ఏపీ వ్యాప్తంగా అమలు అవుతుందని ప్రకటించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం యాదమరిలో నిర్వహించిన సంజీవని కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. సంజీవని కేవలం ఒక సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదని, ఇది ఓ సమగ్ర డిజిటల్ పబ్లిక్ హెల్త్ ఆపరేటివ్ సిస్టమ్ అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ అడుగులు వేస్తోందని సీఎం స్పష్టం చేశారు. సంజీవని ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సిటిజెన్ వెల్ నెస్ మిషన్ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరెటివ్ అనే మూడు సూత్రాల ఆధారంగా ఈ వ్యవస్థ పని చేస్తుందని సీఎం అన్నారు. ముందస్తుగా గుర్తించటం, వ్యాధి రాకముందే నివారణ, చికిత్సల ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. వ్యక్తిగత డిజిటల్ హెల్త్ రికార్డులను వైద్యులు నిరంతరం పర్యవేక్షించేలా ఈ వ్యవస్థ సేవలందిస్తుందని వెల్లడించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన సంజీవని కార్యక్రమం... ఈ ఏడాది మార్చి నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమల్లో ఉందని.... ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి ప్రకటించారు. 42 వైద్య పరీక్షలను ఇంటి వద్దే నిర్వహించి రిపోర్టులు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజారోగ్యానికి అవసరమైన ప్రతీ అంశాన్ని సంజీవని ప్రాజెక్టు ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. డాక్టర్ అప్పాయింట్మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డుల పర్యవేక్షిస్తామని వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా వైద్య సేవలు పొందేలా చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**వైద్యరంగానికి ఎక్కువ నిధులు**

వైద్య ఖర్చులు భరించలేక కుటుంబాలు ఆర్ధికంగా చితికిపోయాయని, ఆ ఇబ్బందులను తప్పించడానికే ప్రజా ప్రభుత్వం సంజీవనిలాంటి వినూత్న ప్రాజెక్టు తీసుకువచ్చిందని అన్నారు. రాష్ట్రంలో విద్య-వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అధిక ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం ఉద్యమం చేపట్టామని అన్నారు. ఈసారి బడ్జెట్ లో వైద్యారోగ్య రంగానికి రూ.19,305 కోట్లు కేటాయించినట్టు వివరించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు పొందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద రాష్ట్రంలో పేదా ధనికా తేడా లేకుండా ప్రతీ ఒకొక్కరికి రూ. 2.50 లక్షల విలువైన వైద్య సేవలు అందిస్తామన్నారు. రూ. 25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ద్వారా వైద్య ఖర్చులు భరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పేదలకు సైతం మెరుగైన వైద్యం అందించేందుకు... ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని ఖాళీలు భర్తీ చేస్తున్నామని వివరించారు. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. ఆహారమే ఔషధం - వంటశాలే ఔషధ శాల అని మరోమారు సీఎం స్పష్టం చేశారు. ప్రజారోగ్యంతో పాటు వారి భవిష్యత్తు కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి వివరించారు.

**శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వరకూ కృష్ణా నీరు**

సమాజంలో ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించటంతో పాటు ప్రతీ నీటి బొట్టునూ సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో సమర్ధ నీటి నిర్వహణ ద్వారా జలవనరుల్ని కాపాడుతున్నామని... భూగర్భ జలాలు కూడా పెంచగలిగామని తెలిపారు. సముద్రంలో వృధాగా పోయే జలాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు అన్నింటినీ నింపగలిగామని వివరించారు. హంద్రీ-నీవా కాలువతో రాయలసీమ జిల్లాల్లోని చివరి ప్రాంతాలకు నీరు తీసుకెళ్లామని అన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న చర్యలతో భూగర్భ జలాలు పెరిగాయని, ఈ కారణంగానే అక్కడ పచ్చదనం పెరిగి ఉష్ణోగ్రతలు తగ్గినట్టు నివేదికలు చెబుతున్నాయని సీఎం అన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో నమోదు అవుతున్నాయని పిడుగురాళ్లలో 49 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని అన్నారు. వర్షపాతం తక్కువ కురుస్తుందన్న అంచనాలు ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి చేసే సంకల్పంతో ఉన్నామని దీనిపై ఇప్పటికే క్యాలెండర్ విడుదల చేసినట్టు తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తీసుకువస్తామన్నారు. శ్రీశైలం మల్లన్న నుంచి తిరుపతి వెంకన్న వరకూ నీటిని తరలిస్తామని చెప్పారు. గాలేరు-నగరి కోడూరు వరకు, మల్లె మడుగు బాలాజీ రిజర్వాయర్- 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. సోమశిల, స్వర్ణముఖి లింక్ కెనాల్-జూన్ 2028 పూర్తి అవుతుందన్నారు.

**రాయలసీమ ఇక ఫైటర్ జెట్ల తయారీ కేంద్రం**

23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకు వచ్చామని... రాష్ట్రంలోని 23 లక్షల మందికి యువతకు ఉద్యోగాలు వస్తాయని సీఎం స్పష్టం చేశారు. రాయలసీమలోని పుట్టపర్తిలో 5 జనరేషన్ యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామని... యుద్ధాల్లో పాల్గొనే జెట్ ఫైటర్ యుద్ధ విమానాల తయారీ కేంద్రంగా పుట్టపర్తి మారబోతోందని సీఎం అన్నారు. రాయలసీమను డిఫెన్స్ హబ్‌గా చేస్తామన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, కర్నూలులో డ్రోన్, అనంతపురంలో ఏరోస్పేస్, స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీలాంటివి ఏర్పాటు కానున్నాయని వివరించారు. తిరుపతిలోనే త్వరలోనే బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ పరిశ్రమ ఏర్పాటు కాబోతోందన్నారు. రాయలసీమలో ఉక్కు పరిశ్రమ, సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు వచ్చే నెల కర్నూల్లో బంగారం ఉత్పత్తి చేసే గనుల్ని కూడా ప్రారంభించబోతున్నట్టు సీఎం తెలిపారు. రూ. 1 లక్ష కోట్లతో రాయలసీమలో ఉద్యాన పంటలను (మిగతా 8వ పేజీలో)

# చోరీలపై ఉక్కుపాదం: 51 కేసులు ఛేదించి, 60 మంది అరెస్ట్!

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నగరంలో చోరీలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, బాధితులకు సత్వర న్యాయం చేయడమే లక్ష్యంగా విశాఖ క్రైమ్ విభాగం పోలీసులు శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన ఏప్రిల్ నెల 'రికవరీ మేళా'లో రికార్డు స్థాయిలో రికవరీ చేసిన సొత్తును బాధితు లకు అందజేశారు. ఏప్రిల్ నెలలో కమిషనరేట్



పరిధిలో మొత్తం 68 చోరీ కేసులు నమోదు కాగా, ఛేదించారు. ఈ కేసులతో సంబంధం ఉన్న 60 మంది ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ముద్దాయిల నుంచి రూ. 1.04 కోట్ల విలువైన ప్రాపర్టీని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 924.14 గ్రాముల బంగారం, 4.5 కేజీల వెండి, రూ. 3.12 లక్షల నగదు ఉన్నాయి. ఈ సొత్తును పోలీస్ కమిషనర్ (సీపీ) శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా శనివారం బాధితులకు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. గడిచిన 22 నెలల్లో విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అద్భుతమైన పనితీరు కనబరిచామని, మొత్తం 9,202 మంది బాధితులకు సుమారు రూ. 22 కోట్ల విలువైన ప్రాపర్టీని రికవరీ చేసి అందజేశామని వెల్లడించారు. ఇటీవల నగరంలో కలకలం రేపిన హనీ ట్రాప్ కేసుపై సీపీ స్పందిస్తూ.. ఈ కేసులో ప్రధాన నిందితుడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్నామని, దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో లోతుగా విచారణ జరుపుతున్నామని తెలిపారు. అలాగే నగరంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, పార్ట్ టైమ్ జాబ్స్ పేరుతో మోసాలు జరిగినా, లేదా ఎవరైనా ఆన్‌లైన్‌లో అసభ్యకరంగా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినా ఏమాత్రం భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌ను ఆశ్రయించాలని సీపీ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు.

## 'జన్ జీ' కౌంటర్



ఎవరి మాటలో నమ్మి విసిరెను
నాగ్, కూటమి విచ్ఛిన్నపు అస్త్రం
అదను చూసి ప్రయోగించెను
రాజ్యం పోలీసు 'కేసు'పతాస్త్రం

కేసులతో తెగ భయపడి
పోతున్నది ఈనాటి జర్నలిజం
ఎందుకు తలవంచాలి
చెప్పినదాంట్లో వుంటే నిజం!

-కలిమిశ్రీ



# మెరైన్ ఇంజినీరింగ్‌లో సీతం అధ్యాపకుడికి పీహెచ్‌డీ

## - ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి లెఫ్టినెంట్ డాక్టర్ ప్రశాంత్ సాధుకు గౌరవ డాక్టరేట్ ధృవీకరణ






**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంలోని సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ (సీతం), మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ప్రశాంత్ సాధుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం, మెరైన్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ ప్రదానం చేసింది. "అధునాతన హైబ్రిడ్ నానోకాంపోజిట్స్ ద్వారా మెరుగైన మైక్రోవేవ్ అబ్జార్ప్షన్" అంశంపై నిర్వహించిన పరిశోధనకు గాను ఆయనకు ఈ డాక్టరేట్ లభించింది. ఈ పరిశోధన ఆధునిక మెటీరియల్స్ మరియు ఇంజినీరింగ్ రంగాలలో విశిష్ట ప్రాధాన్యతను సంతరించుకుంది. పీహెచ్‌డీ ధృవీకరణ పత్రాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయ గౌరవ ఉపకులపతి ప్రొఫెసర్ రాజశేఖర్ అందజేశారు. ఈ సందర్భంగా సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, అధ్యాపకులు మరియు సిబ్బంది లెఫ్టినెంట్ డాక్టర్ ప్రశాంత్ సాధును అభినందించారు. పరిశోధన, బోధన రంగాలలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సీతం విద్యా సంస్థలో పరిశోధనాభివృద్ధి, నాణ్యమైన ఉన్నత విద్య, అధ్యాపకుల అకాడమిక్ ప్రతిభాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్న దానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు.



## మీ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మీ పిల్లలను ప్రభుత్వ బడుల్లో మాత్రమే చేర్పించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బోధన సిబ్బంది శనివారం మండలములోని కాలంరాజుపేట, డోలపాలెం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఆరో తరగతి నుంచి పదో తరగతిలో ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. విద్యార్థులకి అడ్మిషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అచ్యుతాపురంలో ఘనంగా ఎన్‌రోల్మెంట్ డ్రైవ్

## - జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పాల్గొని డోర్ టు డోర్ ప్రచారం








**అనకాపల్లి/ అచ్చుతాపురం, (రాజధాని వార్తలు):** అచ్యుతాపురం మండలం పెదపాడు, జగ్గన్నపేట గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల చేరికలను పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు స్వయంగా కార్యక్రమంలో పాల్గొని డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. తల్లిదండ్రులను ప్రత్య క్షంగా కలుసుకొని ప్రభుత్వ పాఠశాలలలో అందుతున్న నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలతో గ్రామసభ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. గ్రామా భివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలు కేంద్ర బిందువుగా నిలవాలని జిల్లా విద్యాశాఖాధికారి సూచించారు. ఈ ప్రచార కార్యక్రమ ఫలితంగా ప్రైవేట్ పాఠశాలలలో చదువుతున్న 8 మంది విద్యార్థులను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. విద్యార్థుల తల్లి దండ్రుల నుండి అంగీకార పత్రాలు స్వీకరించడం జరిగింది. అధికారులు, ఉపాధ్యాయులు రాత్రి 9.15 గంటల వరకు గ్రామంలో ప్రచారం నిర్వహించి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం మండల విద్యాశాఖాధికారులు దేవరాయలు, రజనీ, ఖగేష్ సిస్టు తదితరులు పాల్గొన్నారు.

# ఐహెచ్‌ఆర్‌సి ఆంధ్రప్రదేశ చాప్టర్ ఉపాధ్యక్షురాలుగా బందెల భారతి




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ జెనీవా ఐక్య సమితి అనుబంధ సంస్థ ఏర్పడిన ఐహెచ్‌ఆర్‌సి ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఉపాధ్యక్షురాలుగా బందెల భారతిని ఆంధ్రప్రదేశ్ చాప్టర్ నేషనల్ ప్రెసిడెంట్ నియమించారు. నెల్లూరు జిల్లాకు చెందిన భారతి ఇంతకుమునుపు ఐ.హెచ్.ఆర్.సి ఫైనాన్స్ సెక్రటరీగా విధులు నిర్వహించినారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు జిల్లాకు చెందిన కళ్యాణ భారతి ట్రస్ట్, ఐహెచ్‌ఆర్‌సి సభ్యులు పరిచయం చేశారు. నిరపరాదులను రక్షించడం, చట్టాన్ని పరిరక్షించడం, న్యాయ సంబంధిత కేసులు తమ దృష్టికి వచ్చిన ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ప్రెసిడెంట్ కె రాజేందర్ విజ్ఞాన్, త్రివేణి, రాజేష్, ఉదయ బాబు, రాజేశ్వరి, పూనం లక్రా, తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో మరికొన్ని రోజులు ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు ముమ్మరంగా వీచే అవకాశం ఉందని, అందువల్ల ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన పలు సూచనలు చేశారు. ?ముఖ్యంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుండి బయటకు రాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. వేసవి తాపానికి తట్టుకునేందుకు వీలుగా నలుపు రంగు, మందపాటి దుస్తులను పక్కన పెట్టి, కేవలం తెలుపు లేదా లేత రంగుల పలుచటి కాటన్ దుస్తులనే ధరించాలన్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా తలకు రుమాలు లేకుండా ప్రయాణించవద్దని, సూర్యకిరణాలు నేరుగా శరీరంపై పడకుండా చూసుకోవాలని కోరారు. నిర్జలీకరణ (డీహైడ్రేషన్) బారిన పడకుండా ఉండటానికి నిరంతరం మంచి నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ నీరు, కొబ్బరిబొండాలు, నిమ్మరసం వంటి ద్రవపదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. గొంతు సమస్యలకు దారితీసే శీతల పానీయాలు, ఐస్ ముక్కలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఒకవేళ ఎవరైనా వడదెబ్బకు గురైతే వారిని తక్షణమే చల్లని నీడలోకి చేర్చి, తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వేడి నీటి బట్టను ఉపయోగించరాదని కలెక్టర్ తెలిపారు. తలతిరగడం, సొమ్మసిల్లడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సహాయం అందించాలన్నారు. మరోవైపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సమయంలో పొలాలు, చెట్లు, కరెంట్ స్తంభాలు లేదా టవర్ల కింద నిలబడకుండా సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. తీవ్రమైన వడగాల్పులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉందని, సంబంధిత అధికారులందరికీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా వాసులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అయితే వ్యక్తిగత జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు.

# క్లీన్ అనకాపల్లి జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

## - జిల్లాలో సంపూర్ణ పారిశుద్ధ్యం 4 వారాలు స్పెషల్ డ్రైవ్ - రోడ్లపై చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండాలి - రోడ్లపై పరిశుభ్రత స్పష్టంగా కనిపించాలి - ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ప్రారంభం : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** పరిశుభ్రతే లక్ష్యంగా నిర్వహించే ఆపరే షన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం వద్ద "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్ర మాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జీవీఎంసీ జోనల్ కమిషనర్ డాక్టర్ లక్ష్మీ తులసితో కలిసి శనివారం ఉదయం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రత, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేసిందని, ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలను 100 శాతం అమలు చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నా మని పేర్కొన్నారు. రోడ్లు, డ్రైన్లు, ప్రజా ప్రదేశాలు గార్బేజ్ ఫ్రీగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్" పేరుతో ప్రభుత్వం నెల రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్ర మాన్ని చేపట్టిందని, జిల్లాస్థాయి అధికారుల నుంచి పారిశుధ్య కార్మికుల వరకు అందరినీ భాగస్వామ్యం చేయాలని పిలుపుని చ్చారు. ప్రజల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిబంధనలపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ డాక్టర్ లక్ష్మీ తులసి, జోన్ సూపరిండెంటెంట్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, ఇతర జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహానిధి పేదలకు కొండంత అండ : వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

## - సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కాకుండా మానవతా దృక్పథంతో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు నెల్లూరు నగరంలోని విపిఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి కోవూరు నియోజకవర్గంలో 24 విడతలుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశామన్నారు. అనారోగ్య కారణాలతో బాధపడి ఆర్థిక ఇబ్బందులు కలిగిన వారికి మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంటి పెద్దలాగా ఆత్మ బంధువులాగా ముఖ్యమంత్రి సహాయ నిధితో సపోర్ట్ చేయడం అభినందనీయమన్నారు. కోవూరు నియోజకవర్గంలో దాదాపు 900 మందికి దాదాపు రూ. 9 కోట్ల మేర సీఎం సహాయనిధి అందజేశామన్నారు. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ద్వారా 130 మందికి రూ.1.71 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యవసర సహాయం అందిస్తూ సీఎం చంద్రబాబు నాయుడు నిరుపేదలకు ఆపన్నహస్తం అందజేస్తున్నారని అన్నారు. అనారోగ్యాల బారిన పడి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందన్నారు.

పేదల పట్ల సిఎం చంద్రబాబు చేస్తున్న సహాయానికి కోవూరు నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తమకు కష్టకాలంలో ప్రభుత్వం నుండి ఈ సహాయం అందేలా కృషి చేసినందుకు వేమిరెడ్డి దంపతులకు లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉప్మాక చెరువుకు మహర్దశ... రూ. 20 లక్షలతో జల సంరక్షణ పనులు వేగవంతం...పునరుద్ధరణ











**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ ముందు చూపుతో గ్రామీణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ అభివృద్ధి, సాగు నీటి సదుపాయాల పెంపు, రైతుల సంక్షేమం కోసం, జలధార జలహారతి పథకంను విస్తృతంగా అమలు చేస్తోంది. ఈ పథకం గొలుగొండ మండలం పప్పు శెట్టిపాలెం గ్రామపంచాయతీ ఉప్మాక చెరువు రూ.20 లక్షలు అంచనా వ్యయంతో పనులకు పరిపాలనా ఉత్తర్వులు జారీ చేయడం అనేది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా పూడికతీత, గట్లు పునర్నిర్మాణము పనులు ఇంత పెద్ద ఎత్తున గొలుగొండ మండలం పప్పు శెట్టి పాలెం పంచాయితీలో చేపడుతున్న పూడిక తీత పనులతో ప్రతి చెరువు నిండుకుండలా జల కళను సంతరించుకుంటుంది. ఈ పనుల ద్వారా200 ఎకరాలకు ఆయకట్టు సాగు నీటి లబ్ధి చేకూరుతుంది. గొలుగొండ మండలం పప్పు శెట్టిపాలెం గ్రామ పంచాయతీ నందు ఉప్పాక చెరువు పూడికతీత తోపాటు గట్లు పునర్నిర్మాణముపనులకు రూ.20 లక్షలతో చేపట్టారు. 332 మంది ఉపాధి హామీ వేతనదారులతో10 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు పూడికతీత గట్లు పునర్నిర్మాణ పనులను చేపడుతున్నారు. అటవీ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు కాలువ ద్వారా చెరువుకు చేరనుంది. తద్వారా ఈ పంచాయతీతో పాటు పరిసర ప్రాంతాల గ్రామ పంచాయతీ లోని పంట భూములకు సాగునీరు కూడా అందనుంది. ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న మామిడి, వరి, కూరగాయల పంటలకు నీరు సంవృద్ధిగా లభించనుంది. ఈ చెరువు పరిధిలో సుమారు 200 ఎకరాలకు ఆయకట్టుకు నీరు అందడంతో పాటు గణనీయంగా బోర్లు, బావులలో భూగర్భ జలాలు పెరగనుంది. జలధార – జలహారతి కార్యక్రమంలో భాగంగా ఈ చెరువును పునరుద్ధించడం వలన చెరువుకు నీరు రావడంతో పాటు పశువులకు త్రాగు నీరు సమృద్ధిగా లభించడం, బోర్లు రీఛార్జ్ కావడం జరుగుతుందన్నారు. అదే విధంగా పంట పొలాలకు సాగు చేసుకోవడానికి సాగునీటి కొరత లేకుండా ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. 332 మందితో ఉపాధి హామీ పథకం ద్వారా జలధార– జలహారతి పనులు చేపట్టడం వలన ప్రతి కుటుంబానికి ఉపాధి దొరకడంతో పాటు వలసలు వెళ్ళే పరిస్థితి కనుమరుగైంది. ఈ పనుల ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సుమారు అదనంగా రూ.30 వేలు వరకు ఆదాయం కలుగుతోందన్నారు. ఈ పనులు కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేయుచున్నారు. ఈ కార్యక్రమం వల్ల వలసలు తగ్గి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోంది. రైతులు మామిడి, వరి, కూరగాయల సాగుతో పాటు నీటి కొరత లేకుండా సంతోషంగా సాగు చేసుకునే పరిస్థితి ఏర్పడింది.

# నక్కపల్లిలో షైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం

**- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు - కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత**









**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో హోంమంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో సైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 103 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున సొంత నిధుల నుంచి నగదు బహుమతులు అందజేశారు. నగదు బహుమతితో పాటు సాలువా, మెమొంటో, ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు. అనకాపల్లి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులను కూడా ఘనంగా సన్మానించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి అందజేశారు. విద్యార్థులకు మంచి ఫలితాలు తీసుకు రావడంలో కృషి చేసిన ఉపాధ్యాయులను రాష్ట్ర హోంశాఖ మాత్యులు వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి సత్కరించారు. గత సంవత్సరం కూడా పాయకరావుపేట నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సొంత నిధులతో ప్రోత్సాహకాలు అందించి సన్మానించినట్లు ఉపాధ్యాయులు గుర్తు చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏపీ విద్యా వ్యవస్థ అంతర్జాతీయ ప్రమాణాల దిశగా ముందుకు సాగుతోందన్నారు.

వంద రోజుల ప్రణాళికలతో ఈసారి పదో తరగతి ఫలితాలు గతంలో ఎన్నడూ లేనంతగా వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలను పత్రికల్లో ప్రకటనల రూపంలో ప్రచురించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని చెప్పారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు నాసిరకం బ్యాగులు ఇచ్చారని విమర్శించారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో బాలికలే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, ఆడపిల్లలు బంగారు తల్లులని కొనియాడారు. పిల్లల పెంపకంలో ఆడ, మగ తేడా చూపకూడదని, వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న చిన్న తప్పిదాల వల్ల కొందరు విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని, ప్రతి విద్యార్థికి ఒక స్పష్టమైన లక్ష్యం అవసరమని తెలిపారు. యువత కూడా రాజకీయాల్లోకి రావాలని హోంమంత్రి పిలుపునిచ్చారు.

# ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**- ఈవీఎం గోడౌన్‌లను వివిధ రాజకీయ పార్టీల నేతలతో కలిసి తనిఖీ : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**









**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అను క్షణం అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోడౌన్‌ను నెలవారీ తనిఖీల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీ క్రమంలో లాగ్ బుక్‌లో సంతకం చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై అధికారులు మరియు నేతలతో మాట్లాడారు. భద్రపరిచిన ఈవీఎంల స్థితిగతులను జిల్లా కలెక్టర్‌కు ఎన్నికల విభాగం అధికారులు వివరించారు. వివిధ రాజకీయ పార్టీల నేతలతో డిఆర్ఓ వై.సత్యనారాయణ రావు సమీక్ష నిర్వహించారు. నెలవారీ సమావేశాలలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఓ వై.సత్యనారాయణ రావు తన చాంబరులో ఎన్నికల జాబితా నవీకరణ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు విషయంలో బూత్ లెవల్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేని శుద్ధమైన ఓటర్ల జాబితా తయారీలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, అనకాపల్లి ఆర్డిఓ ఆయేషా, జిల్లా ఫైర్ ఆఫీసర్, టిడిపి పార్టీ నుండి బి.శ్రీనివాస రావు, ఏఏపి నుండి కే.హరినాథ్ బాబు, బీఎస్పీ నుండి ఎస్.వి.వి.రామచంద్రరావు, వైయస్సార్సీపి నుండి పి.గోవింద, సిపిఎం నుండి శ్రీరామ్, స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# పరిశ్రమల నిర్వహణకు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు పూర్తి సహకారం

**- డీఐఈపీసీ సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**







**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** పరిశ్రమల నిర్వహణకు, కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం ఉం టుందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన డీఐఈపీసీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ అండ్ ప్రమోషన్ కమిటీ) సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గత కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు, పారిశ్రామిక అనుమతులు, ఏర్పాటుచేసిన యూనిట్లకు అందించవలసిన ప్రోత్సాహకాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడు తూ జిల్లాలో పరిశ్రమలు, పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సహకాలు, అనుమతులు త్వరితగతిన మం జూరు చేసి ప్రోత్సహించాలని అధికారులకు తెలిపారు. పారిశ్రా మిక అనుమతులు కొరకు సింగిల్ డెస్క్ పాలసీలో వివిధ శాఖల వద్ద పెండింగులో గల ధరఖాస్తులపై అధికారులకు పలు సూచ నలు చేశారు. పరిశ్రమలు స్థాపనకు వచ్చిన ధరఖాస్తులు పరిశీ లించి అర్హత, ఆశక్తి గల వారికి వెంటనే అనుమతులు, మౌళిక సదుపాయాలు కల్పించాలని, రుణ సదుపాయం పొందేందుకు సహకారం అందించాలని తెలిపారు. అనుమతులు మంజూరు చేసిన యూనిట్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి, ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేటాయించిన భూముల్లో నిర్ణీత సమయంలో సదరు నిర్వాహకులు పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో అనుమతులు రద్దు చేసి కొత్త వారికి కేటాయించాలని ఆదేశించారు. జిల్లాలో మంజూరై ప్రారంభించిన యూనిట్లకు సబ్సిడీ ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ముఖ్యంగా పారిశ్రామిక వాడల్లో అవస్థాపనా సౌకర్యాలు కల్పించటంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు, పరిశ్రమలు జనరల్ మేనేజరు కె.పి.కె. ప్రసాద్, ఎల్.డి.ఎం., కె.సత్యనారాయణ, కమిటీ సభ్యులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ముసుగులు తొలగిన మతతత్వం!

'వారు నాకు ఓటు వేయలేదు. వారి బాగోగులకు నేను బాధ్యత వహించను'- పశ్చిమ బెంగాల్ శాసన సభకు కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యే రితేశ్ తివారీ అన్న మాటలవి. ఈ ఉద్ఘాటన మానవ ధర్మ ప్రేరిత మేనా? ఒక్క క్షణం ఆలోచించండి. ఆ మాటల్లోని అనైతికత, దుర్మార్గం అర్థమవుతుంది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికైన ప్రజాప్రతినిధి అలా మాట్లాడవచ్చునా? పరిపాలన, పౌరసత్వ హక్కులు ఇప్పుడు మతపరమైన ఓటింగ్ సరళిపై ఆధారపడి ఉన్నాయని ఆ ప్రజాప్రతినిధి ప్రభావశీలంగా సూచించడమే కాదూ ఆ ప్రకటన? ముస్లింలు తనకు ఓటు వేయనప్పుడు తాను ప్రాతినిధ్యం వహించేందుకు వారు సరైన అర్హులు కారని ఆ బెంగాలీ ఎమ్మెల్యే ఆ మాటలతో చెప్పకనే చెప్పాడు. రవీంద్రుడి ఆత్మ క్షోభించి ఉంటుంది. విశాల భారతావని ఆ మహాకవిని మరచిపోనట్లయితే కొత్త 'ప్రజాప్రతినిధి' కుత్సిత పలుకులకు భగ్గుమనేది కాదూ? అలా జరగలేదు! ఇదే, బహుశా, ఈ బెంగాల్ ముచ్చటలోని అత్యంత ఆందోళనకరమైన విషయం. వర్తమాన భారతదేశంలో నేడు మనం కంటున్నవీ వింటున్నవీ కేవలం మతతత్వ రాజకీయాలు కావు. అవి ఇంతకు ముందు కూడా ఉన్నాయి. ఇప్పుడు మనం చూస్తోంది మతతత్వ రాజకీయాల సర్వవ్యాపకత్వం. అవును, అవి సర్వసాధారణమైపోయాయి. ఆ బెంగాలీ అన్న మాటలను గతంలో ఎవరైనా వదరి ఉంటే వారి రాజకీయ జీవితాలకు అవి భరతవాక్యాలు అయి వుండేవి. అయితే ఇప్పుడు అవి కేవలం ఎన్నికల ప్రలాపమని, పట్టించుకోవల్సినంత ముఖ్యమైనవి ఏ మాత్రం కావని కొట్టివేస్తున్నారు! మత ప్రాతిపదికన ప్రజలను సమీకరించేందుకు రాజకీయులు ఇంకెంత మాత్రం సంకోచించడం లేదు. గతంలో గోప్యంగా చేసిన ఆ పనిని ఇప్పుడు బాహాటంగా అడ్డూ అదుపులేని రీతిలో నిస్సంకోచంగా చేస్తున్నారు. అందుకే కాబోలు భారత జాతీయ కాంగ్రెస్‌ను 'కొత్త ముస్లిం లీగ్' అని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు అభివర్ణించారు. రిజిజు వ్యాఖ్య వెనుక ఉన్న వాదన ఏమిటో నిశితంగా చూద్దాం. అసోం, బెంగాల్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు అందరూ దాదాపుగా ముస్లిం అభ్యర్థులే అయినందున కాంగ్రెస్ ఒక మతతత్వ పార్టీగా పరిణమించింది. అవును, అసోంలో ఎన్నికైన 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 18 మంది ముస్లింలే. అలాగే బెంగాల్‌లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులు ఇరువురూ ముస్లింలే. సరే, కేరళలో కాంగ్రెస్ మిత్రపక్షం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎన్నికల్లో జయాపజయాలను ప్రభావశీలంగా నిర్ణయించే రాజకీయ శక్తి. అయితే కాంగ్రెస్‌ను మతతత్వ పార్టీగా నిందిస్తున్నవారు ఒక వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు 650 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో అత్యధికులు ముస్లిమేతరులే. అయినప్పుడు కాంగ్రెస్ మతతత్వ పార్టీ ఎలా అయింది? ఆ ప్రశ్నకు సమాధానం అంక గణితంలో కాకుండా రాజకీయ సందేశం- ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు చేసే ప్రసంగాలు, ప్రకటనలు సామాజిక మాధ్యమాల్లో జరిగే ప్రచారంలో ఉన్నది. ముస్లింల రాజకీయ ప్రాతినిధ్యాన్ని అనుమానాస్పదం చేయడమే అసలు లక్ష్యం. ప్రధానస్రవంతి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులుగా ముస్లిం అభ్యర్థులు చెప్పుకోదగిన సంఖ్యలో ఎన్నికైనప్పుడు సదరు పార్టీపై మతతత్వ పార్టీ అనే ముద్ర వేయడమే అటువంటి వ్యాఖ్యలు చేసేవారి అభీష్టం. మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యాన్ని చట్టవిరుద్ధం చేయడం, మెజారిటీ వర్గ ఆధిపత్యాన్ని జాతీయ వాదంగా చూపడమే రిజిజు వ్యాఖ్య పరమార్థం. ఈ రాజకీయ విలోమం చాలా చాలా ప్రమాదకరమైనది. బెంగాల్‌లో సువేందు అధికారి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన హిందువులకు బీజేపీకి ఓటువేయమని బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. గెలిచిన తరువాత వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే ఏ ప్రతిపక్ష నాయకుడు అయినా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ముస్లిం ఓటర్లకు తమ పార్టీకి ఓటువేయమని విజ్ఞప్తి చేసి ఉంటే ఏమయి వుండేది? లౌకికవాదాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత హిందువులపైనే ఎందుకు మోపుతున్నారని పలువురు తరచు ప్రశ్నిస్తున్నారు. ముస్లిం ఓటర్లు ప్రధానంగా ముస్లిం అభ్యర్థులకే ఎందుకు ఓటు వేస్తున్నారు? ముస్లిం ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం నుంచి హిందూ అభ్యర్థి విజయం సాధించగలడా? ఇవి న్యాయబద్ధమైన ప్రశ్నలే. వీటికి సమాధానం ఒక రాజకీయ వాస్తవాన్ని గుర్తించడంలో ఉన్నది: భారత జనాభాలో హిందువులు 80 శాతంగా ఉన్నారు. పరిపూర్ణ భద్రతా భావంతో నిండు ఆత్మ విశ్వాసంతో ఉన్న మెజారిటీ హిందువులు మాత్రమే దేశం మెజారిటేరియన్ జాతీయవాదంలోకి జారిపోకుండా నివారించగలరు. సరే, లౌకికవాదం బలహీనపడడం బీజేపీతో మాత్రమే ఆరంభమయిందా? అలా భావించడం, ఆ సంక్షోభానికి ఆ పార్టీనే తప్పుపట్టడమంటే ఆత్మ వంచన చేసుకోవడమే అవుతుంది. లౌకికవాద పార్టీలుగా పరిగణన పొందుతున్న రాజకీయ పక్షాలు రెండు చారిత్రక తప్పిదాలకు పాల్పడ్డాయి. ముస్లింల సామాజిక పురోగతి, ఆర్థికాభ్యుదయానికి చిత్తశుద్ధితో కృషి చేయకుండా వారిని తమ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఓటు బ్యాంకుగా చూడడం మొదటి చారిత్రక నేరం. మితవాద ముస్లిం మతాచార్యుల ఒత్తిడికి లొంగిపోయి షాబానో కేసు తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడమైనా, లేదా ప్రాంతీయ పార్టీలు తమ ప్రతీకాత్మక రాజకీయాల ద్వారా ముస్లింల అభద్రతా భావాన్ని స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడమైనా ముస్లింలకు తరచు పంపుతున్న సందేశం: మాకు ఓటు వేయండి. మిమ్ములను హిందూ మితవాదుల నుంచి సంరక్షిస్తాం. సంరక్షణ రాజకీయంగా మారింది. అయితే సాధికారత అరుదుగా లభించింది. లౌకికవాద పార్టీలు పాల్పడిన రెండో చారిత్రక తప్పిదం కూడా మొదటిదాని వలే లౌకికవాద విలువలకు తీవ్ర నష్టం చేసింది.

# ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ బ్యాంకింగ్‌పై అవగాహన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కిషోరి బాలికలకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ బ్యాంకింగ్ మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిషోరి బాలికల సమగ్ర వికాసాన్ని లక్ష్యంగా పెట్టుకుని నిర్వహిస్తున్న కిషోరి వికాసం వేసవి కార్యక్రమాలలో భాగంగా సామర్లకోట మండలం భాస్కర్ నగర్ కాలనీలో కిషోరి బాలికలకు ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్ విధానాలు, డిజిటల్ చెల్లింపులు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు, సీడీపీఓ జి ఉష అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, నేటి సమాజంలో బాలికలు విద్యతో పాటు ఆర్థిక అక్షరాస్యతను కూడా అలవరచుకోవడం అత్యంత అవసరమన్నారు. బాలికలు చిన్న వయస్సు నుంచే పొదుపు అలవాటు, డబ్బు నిర్వహణ, బ్యాంకింగ్ సేవల వినియోగంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఆర్థికంగా స్వావలంబులు కావచ్చని తెలిపారు ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాల నిర్వహణ, సేవింగ్స్ ప్రాముఖ్యత, ఏటీఎం కార్డుల వినియోగం, పాస్‌బుక్ నిర్వహణ, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, యూపీఐ లావాదేవీలు, ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి డిజిటల్ చెల్లింపుల వినియోగంపై బాలికలకు వివర ణాత్మకంగా తెలియజేశారు. డిజిటల్ లావాదేవీల సమయంలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంక్ పిన్ నంబర్లు ఇతరులతో పంచుకోరాదని సూచించారు. అలాగే బాలికల భవిష్యత్తు భద్రత కోసం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సుకన్య సమృద్ధి యోజన, బాలికల విద్యా ప్రోత్సాహక పథకాలు, మహిళా సాధికారత పథకాలు, పొదుపు పథకాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

ప్రభుత్వ పథకాలపై సరైన సమాచారం ఉంటే బాలికలు విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో మరింత పురోగతి సాధించగలరని తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణపై కూడా ఆయన ప్రత్యేకంగా వివరించారు. ఈ సందర్భంగా బాలిక లకు వ్యక్తిత్వ వికాసం, విద్యా ప్రాధాన్యత, ఆరోగ్య సంరక్షణ, సామాజిక బాధ్యతలపై కూడా సూచనలు చేశారు. సమాజ అభివృద్ధిలో బాలికల పాత్ర ఎంతో కీలకమని, వారు విద్యతో పాటు ఆర్థికంగా మరియు సామాజికంగా బలపడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కిషోరి బాలికలు పలు ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్య క్రమం బాలికల్లో మంచి అవగాహన కల్పించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉమా దేవి, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది బి లక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, స్థానిక మహిళలు, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

# జగన్ అన్నా.. నిజం అన్నా.. అంత భయమా అమాత్యా?

- జగన్ చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలి గానీ వ్యక్తిగత దాడులా?
- ప్రజలకు నిజాలు తెలియకుండా డైవర్షన్ పాలిటిక్స్ ఎందుకు?
- రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి : జమ్మలమడక నాగమణి



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల ముందుంచారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడుక నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆమె కూటమి ప్రభుత్వ పనితీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్ చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాల్సిన మంత్రులు, వాస్తవాలను ఖండించలేక వ్యక్తిగత విమర్శలకు దిగడం సిగ్గుచేటని ఆమె మండిపడ్డారు. మంత్రి ఇందిరపు అచ్చంనాయుడు, గొట్టిపాటి రవికుమార్, కొల్లు రవీంద్ర చేస్తున్న వ్యాఖ్యలు చూస్తుంటే "గురువింద తన కింద నలు పెరుగదు" అన్న సామెత గుర్తుకు వస్తోందన్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సొంత నియో జకవర్గంలోనే మైనర్ బాలికపై అఘాయిత్యం జరగడం దురదృష్టకరమని, రెండు మూడు నెలల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. మహిళా హోంమంత్రి ఉన్నప్పటికీ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ఆ వైఫల్యా లను కప్పిపుచ్చుకునేందుకే జగన్‌పై మంత్రులు అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. జగన్ వ్యాఖ్యల్లో తప్పులుంటే వాటిపై స్పందించాల్సిందిపోయి, ప్రజల దృష్టి మళ్లించే రాజకీయాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటలు మద్యం ఏరులై పారుతోందని, ఫలితంగా ప్రజలు మత్తులో మునిగిపోతున్నారని నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం మత్తుతో ప్రమాదాలు పెరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు బైపాస్ రోడ్డులో జరిగిన ప్రమాదానికి డ్రైవర్ అతిగా మద్యం సేవించడమే కారణమని ఆమె ఆరోపించారు. మట్టి, ఇసుక, గ్రావెల్ దోపిడీ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందని, ఎమ్మెల్యేలు వాటాల పంపకాలతో బిజీగా ఉన్నారని విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలో మట్టి మాఫియా రవాణా కారణంగా ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ప్రస్తావిస్తూ ప్రభుత్వం చలనం లేకుండా వ్యవహరిస్తోందన్నారు. అంతేకాకుండా, స్వర్గీయ ఎన్టీ రామారావు ఆత్మ క్షోభించేలా పార్టీని స్వాధీనం చేసుకున్నది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. కాపు నేత వంగవీటి మోహన్ రంగా హత్యను రాజ కీయ లబ్ధి కోసం ఉపయోగించుకున్న విషయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో జగన్‌కు సంబంధం ఉందని నిరూపించేందుకు ఎన్నో ప్రయత్నాలు విఫలమయ్యాయని, చివరకు కుటుంబంలోనే విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేశారని నాగమణి ఆరోపించారు. "రాష్ట్రంలో జరుగుతున్న వాస్తవాలను ప్రజలకు తెలి యజేస్తే ఎందుకు అంత భయం? జగన్ చెప్పింది నిజం కాదంటే వాస్తవాలతో ఖండించండి. కానీ వ్యక్తిత్వ హననానికి దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆమె స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు.. మంత్రి పొంగులేటి సెటైర్లు



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** మాజీమంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా నుంచి ఫ్యూచర్ సిటీని ఆపేస్తామంటూ హరీశ్‌రావు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పొంగులేటి పోస్టు పెట్టారు. బీఆర్ఎస్‌లో హరీశ్‌రావు ఫ్యూచర్ ఏంటో ఆయనకే తెలియదు అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ భూములపై అమెరికాలో ఎవరికైనా ఒప్పందాలు చేసుకున్నారా..? అంటూ నిలదీశారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో ఒక్క మెట్రోస్టేషన్ కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకంగా కొత్త నగరాన్ని నిర్మిస్తోందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబం ఫాంహౌస్‌లు కట్టుకుందని.. కానీ తాము రాష్ట్ర భవిష్యత్తు కోసం ఫ్యూచర్ సిటీ కడుతున్నామని ఉద్ఘాటించారు. మూసీప్రక్షాళన, లగచర్ల ఇండస్ట్రీస్‌కు బీఆర్ఎస్ నేతలు అడ్డుపడ్డారని ఆగ్రహించారు. యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రయత్నాలను కుట్రలతో అడ్డుకున్నారని ఫైర్ అయ్యారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశం గర్వించే విధంగా తాము ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్తు ఖతం చేయాలని బీఆర్ఎస్ నేతలే చూస్తున్నారని సెటైర్లు గుప్పించారు. 'బీఆర్ఎస్‌కు ఫ్యూచర్ లేదు.. ఫ్యూచర్ సిటీకి తిరుగులేదు' అంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు.

# సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. శుక్రవారం పెద్దాపురం తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలకు సంబంధించి అర్జీలను ఎమ్మెల్యే చినరాజప్పకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమ స్యలపై నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజా సూరి బాబురాజు, బదుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, నూనె రామారావు, పాలకుర్తి శ్రీనుబాబు, వల్లూరి దొరబాబు, బలుసు వాసు, గోల్తి సత్యనారాయణ, రేలంగి వెంకట్రావు, తాతపూడి అరుణ్ వంశీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాస్త్రీయ దృక్పథంతో విద్యార్థులు ముందుకెళ్ళాలి

- పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధ శ్రీనివాస్




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** నేటితరం విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని, సైన్స్ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో జరుగుతున్న పిసిసి సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవారం సైన్స్ టాయ్స్, సైన్స్ ఇంద్రజాలాన్ని ప్రదర్శన చేసి విద్యార్థులతో చేయించారు. విద్యార్థులు అందరూ సైన్స్‌కి సంబంధించిన ఆధారాలు నిరూపణతోనే సమాజాన్ని అర్థం చేసుకోవాలన్నారు. భూమి ఆకర్షణ శక్తి గమనాన్ని అందరూ అర్థం చేసుకోవాలని కోరారు. శాస్త్రీయ భావాలతో ఉండడం ద్వారా మాత్రమే విద్యార్థులు అభివృద్ధి, సమాజ అభివృద్ధి జరుగుతుందని, సమాజ అభివృద్ధిలో విద్యార్థుల భాగస్వామ్యమే ప్రధానమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్, నెక్కల అనూష, జశ్విత, తేజ, సాయి, లలిత, లావణ్య, మహాపాదిన నవ్య, సహస్ర, మెర్సీ, సందీప్, యోగేశ్వర్, కామేష్, సోహిత్, విమలరాణి, నరసింహమూర్తి, సత్యనారాయణ తదితరులు వాలంటీర్‌లుగా పాల్గొన్నారు.

# అమరావతి నిర్మాణంపై వైసీపీది అనవసర రాద్ధాంతం




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** అమరావతి నిర్మాణంపైన, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంపై వైసీపీ రాద్ధాంతం చేస్తున్నాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ధ్వజమెత్తారు. పెద్దాపురం క్యాంపు కార్యాలయంలో ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పాలన కొనసాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం నేతృత్వంలో రాష్ట్ర రాజధాని నిర్మాణం, పోలవరం వంటి పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి నాయకులు, కార్యకర్తలు తీసుకు వెళ్ళాలన్నారు. పోలవరం 2027 నాటికి పూర్తి కానుందన్నారు. ప్రభుత్వ సహకారంతో నియోజక వర్గంలో ఆసుపత్రులు, దేవాలయాల నిర్మాణాలను సైతం అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టనున్నారన్నారు. ఇప్పటి వరకు సీఎం రిలీఫ్ ఫండ్‌లో భాగంగా సుమారు రూ. 3కోట్లు అర్హులకు అందజేశామన్నారు. ఈ నెలాఖరున పెద్దాపురం నియోజకవర్గంలో జరిగే మినీ మహానాడును విజయవంతం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, రాజా సూరిబాబు రాజు, నూనే రామారావు, బదుగు శ్రీకాంత్, అడబాల కుమార స్వామి, బలుసు వాసు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒక్క లుక్‌తో మాయ చేస్తున్న 'యానిమల్' బ్యూటీ!



యానిమల్' సినిమాతో నేషనల్ క్రష్‌గా మారిపోయిన బాలీవుడ్ బ్యూటీ త్రిప్తి దిమ్రి.. తన లేటెస్ట్ ఫోటో షూట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సాంప్రదాయ దుస్తుల్లో అదిరిపోయే గ్రేస్‌తో సమ్మర్ స్టైల్ ఇన్‌స్పిరేషన్‌గా నిలిచింది. పచ్చని ప్రకృతి మధ్య, ఎండ కాంతిలో మెరిసిపోతూ అచ్చమైన భారతీయ నారిలా కట్టిపడేసింది. త్రిప్తి ఎలాంటి హెవీ మేకప్ లేకుండా చాలా సింపుల్‌గా కనిపించడానికి ఇష్టపడుతుంది. ఆమె న్యాచురల్ గ్లో, మెరిసే కళ్ళు, ఆకర్షణీయమైన నవ్వే ఈ ఫోటోల్లో మెయిన్ హైలెట్‌గా నిలిచాయి. ఆ విశేషాలు చూద్దాం.

**డ్రెస్సింగ్ స్టైల్ అదిరిపోయిందిగా:**

ఈ ఫోటో షూట్ కోసం త్రిప్తి 'దృష్టి & జహాబియా' అనే లగ్జరీ ఫ్యాషన్ లేబుల్ డిజైన్ చేసిన వైబ్రెంట్ ఎత్నిక్ కో-ఆర్డ్ సెట్ వేసుకుంది. లైమ్ ఎల్లో రంగు స్లీవ్‌లెస్ కుర్తీపై పెద్ద పెద్ద తెల్లటి, గ్రీన్ కలర్ ఫ్లోరల్ డిజైన్లు ఉన్నాయి. ఇక దీనికి కాంబినేషన్‌గా లీఫీ ఎమరాల్డ్ గ్రీన్ కలర్ సిల్క్ దుపట్టాను భుజాలపై వేసుకుని రాయల్ లుక్‌లో మెరిసిపోయింది.

**మొక్కలతో ట్విన్నింగ్:**

బ్యాక్‌గ్రౌండ్‌లో పచ్చటి చెట్లు ఉం డటం, త్రిప్తి కూడా గ్రీన్ కలర్ కాంబినేషన్ డ్రెస్ వేసుకోవ డంతో ఈ ఫోటోలు చాలా కలర్‌ఫుల్‌గా వచ్చాయి. దీనికి తగ్గట్టుగానే త్రిప్తి తన ఇన్‌స్టాగ్రామ్‌లో "ఈరోజు నా మొక్కలతో ట్విన్నింగ్ చేస్తున్నా" అంటూ పెట్టిన క్యాప్షన్ కూడా ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది.


**స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచిన జ్యువెలరీ:**

ఈ ట్రెడిషనల్ లుక్‌ను మరింత ఎలివేట్ చేయడానికి త్రిప్తి సిల్వర్ జుమ్కాలను ఎంచుకుంది. పింక్ కలర్ పూసలు ఉన్న మల్టీ లేయర్ సిల్వర్ జుమ్కాలు, చేతికి సిల్వర్ బ్రాస్‌లెట్, వేలికి పెద్ద రింగ్ పెట్టుకుని క్లాస్ లుక్‌తో మాయ చేసేసింది. ఇక పీచ్ టోన్ మేకప్, లైట్ పింక్ లిప్‌స్టిక్‌తో ఆమె అందం మరింత రెట్టింపైంది.

**క్రేజీ సినిమాలతో దూసుకుపోతోంది:**

ప్రస్తుతం త్రిప్తి కెరీర్ ఫుల్ జోష్‌లో సాగుతోంది. రీసెంట్‌గా 'ధడక్ 2', షాహిద్ కపూర్‌తో 'ఓ రోమియో' సినిమాలతో మెప్పించిన ఈ బ్యూటీ.. త్వరలో ఓటీటీలోకి రాబోతోంది. ఇక మాధురీ దీక్షిత్‌తో కలిసి నటించిన కామెడీ థ్రిల్లర్ 'మా బెహన్' జూన్ 4 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఇక తెలుగులో రెబల్ స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతోంది. గ్లామర్ షో మాత్రమే కాదు.. ఇలా పద్ధతిగా, సింపుల్‌గా సాంప్రదాయ లుక్‌లో కనిపించినా త్రిప్తి దిమ్రి లుక్స్‌కు ఫ్యాన్స్ ఫిదా అయిపోవాల్సిందే. తన న్యాచురల్ బ్యూటీతో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న ఈ 'యానిమల్' బ్యూటీ, రాబోయే రోజుల్లో 'స్పిరిట్' మూవీతో టాలీవుడ్‌ను కూడా ఒక ఊపు ఊపడం ఖాయంగా కనిపిస్తోంది.

# మోడ్రన్ లుక్‌లో మైండ్ బ్లాక్ చేస్తున్న రానా వైఫ్



టాప్ హీరోల భార్యలలో సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ ఉన్న వాళ్లలో దగ్గుబాటి రానా వైఫ్ మిహీక బజాజ్ ఒకరు. ఎప్పుడూ ట్రెండీగా ఉంటూ, ట్రెండ్స్‌కు తగ్గట్టుగా అప్‌డేట్ అయ్యే మిహీక.. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ హల్చల్ చేస్తున్నాయి. మోడ్రన్ దుస్తులలో హీరోయిన్లకు ఏమాత్రం తీసిపోని విధంగా కనిపిస్తూ అందరినీ ఫిదా చేసేస్తోంది. స్టైకింగ్ పోజులతో మైండ్ బ్లాక్ చేస్తున్న మిహీక లేటెస్ట్ ఫోటోల ముచ్చట్లు ఇప్పుడు చూద్దాం!

**ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోస్ షేర్ చేసిన మిహీక:**

సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే మిహీక.. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో కొన్ని అదిరిపోయే మోడ్రన్ ఫొటోలను పోస్ట్ చేసింది. ఇక ట్రెండీ అవుట్‌ఫిట్‌లో ఉన్న ఆమె లుక్ చూసి నెటిజన్లు లైకులు, షేర్లతో ఈ ఫొటోలను ట్రెండ్ చేస్తున్నారు. అటు వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, ఇటు ఫ్యాషన్ ఐకాన్‌గానూ మిహీక దూసుకుపోతోంది.

**అదిరిపోయిన మోడ్రన్ డ్రెస్సింగ్ స్టైల్:**

ఈ ఫొటో షూట్‌లో మిహీక చాలా స్టైలిష్‌గా కనిపించింది. క్రీమ్ కలర్ స్ట్రాప్‌లెస్ క్రాప్ టాప్ వేసుకుని, దానిపై ఆలివ్ గ్రీన్, గోల్డ్, ఆఫ్ వైట్ కలర్ కాంబినేషన్‌తో ఉన్న కలర్-బ్లాక్డ్ షర్టును స్టైల్‌గా ఓపెన్‌గా వేసుకుంది. దీనికి మ్యాచ్ చేస్తూ హై-వేస్టెడ్ రిలాక్స్డ్ బ్లాక్ ట్రౌజర్ ధరించింది. ఇక హై-బన్ హెయిర్ స్టైల్, చేతికి సింపుల్ బ్రాస్‌లెట్స్ వేసుకుని చాలా ఎలిగెంట్‌గా మెరిసిపోయింది.

**క్యాప్షన్ వెనుక ఉన్న అసలు సీక్రెట్:**


ఈ ఫొటోలు పెడుతూ మిహీక.. "నా మైండ్‌లో ఈ ప్లేస్‌లో వెయ్యి సార్లు నడిచి ఉంటాను. కానీ ఈ క్షణం నన్ను ఎంతగానో సర్‌ప్రైజ్ చేసింది" అంటూ ఒక క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది. నిజానికి ఇది కేవలం ఫ్యాషన్ షూట్ మాత్రమే కాదు.. మిహీక లీడ్ డిజైనర్‌గా ఉన్న లగ్జరీ ఇంటీరియర్ డిజైన్ సంస్థ 'బోహీమ్ స్టూడియో' సాధించిన ఒక పెద్ద మైల్‌స్టోన్‌ను సెలబ్రేట్ చేసుకుంటూ పెట్టిన పోస్ట్ ఇది.

**అటు బిజినెస్.. ఇటు రానా కెరీర్:**

మిహీక కేవలం స్టార్ వైఫ్ మాత్రమే కాదు.. సక్సెస్‌ఫుల్ క్రియేటివ్ ఆంత్రప్రెన్యూర్‌గా, ఇంటీరియర్ డిజైనర్‌గా బిజినెస్‌లో రాణిస్తోంది. ఇక భర్త రానా విషయానికి వస్తే, 'బాహుబలి' తర్వాత ఆయన ఒకే తరహా సినిమాలు కాకుండా వైవిధ్యమైన పాత్రలు, వెబ్ సిరీస్‌లు చేస్తూ కెరీర్‌లో చాలా బిజీగా గడుపుతున్నారు. ఈ ఇద్దరూ తమ తమ రంగాల్లో ఫుల్ జోష్‌లో ఉన్నారు.

భర్తతో కలిసి దిగిన క్యూట్ పిక్స్‌తో పాటు ఇలాంటి అల్ట్రా మోడ్రన్ లుక్స్‌ను షేర్ చేస్తూ మిహీక నిత్యం వార్తల్లో నిలుస్తోంది. బిజినెస్ ఉమన్‌గా సత్తా చాటుతూనే, గ్లామర్ పరంగానూ స్టార్ హీరోయిన్ల రేంజ్‌లో మెస్మరైజ్ చేస్తున్న మిహీక లేటెస్ట్ ఫోటోలు దగ్గుబాటి ఫ్యాన్స్‌ను మాత్రమే కాకుండా సాధారణ నెటిజన్లను కూడా విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

# వరుణ్ ధావన్ 'కల్కి 2898 ఏడి' లాంటి సినిమా?



దర్శకుడు నాగ్ అశ్విన్ కల్కి 2898 ఏడి చిత్రంలో పురాణాలను, భవిష్యత్తు సాంకేతికతను ముడిపెడుతూ మూడు విభిన్నమైన ప్రపంచాలను అద్భుతంగా ఆవిష్కరించారు. మొదటిది కాశీ -కలియుగం అంతానికి చేరుకున్న వేళ ప్రకృతి అంతరించి, వనరుల కోసం జనం అలమటించే భూమిపై చివరి నగరం. దీనికి పూర్తి భిన్నంగా ఆకాశంలో తలకిందుల పిరమిడ్ ఆకారంలో తేలియాడే కాంప్లెక్స్ అనే మరో విలాసవంతమైన ప్రపంచాన్ని సృష్టించారు. సమస్త వనరులు, సంపదలు కలిగిన ఈ నగరంలో కేవలం సమాజంలోని పాలకులే జీవిస్తుంటారు. ఇక మూడవది శంబల- కాంప్లెక్స్ పాలకుల అరాచకాలను ఎదిరించే తిరుగుబాటుదారులకు, శరణార్థులకు ఆశ్రయం ఇచ్చే ఒక రహస్య హిమాలయ లోయ. ఈ మూడు భిన్న వాతావరణాలు, సంస్కృతులు కలిగిన నగరాలను ఆయన కథాంశంలో ఎంతో చాకచక్యంగా కనెక్ట్ చేశారు. ఈ మూడు విభిన్న ప్రపంచాలను దర్శకుడు ప్రాజెక్ట్ కె అనే ఒక రహస్య ప్రయోగం ..సుమతి (దీపికా పదుకొనే) గర్భంలో పెరుగుతున్న శిశువు చుట్టూ అల్లిన కథతో అనుసంధానించారు. కాంప్లెక్స్ ల్యాబ్ నుండి తప్పించుకుని శంబల వైపు ప్రయాణించే సుమతి.. ఆమెను రక్షించడానికి మహాభారత కాలం నుండి వేచి ఉన్న అశ్వత్థామ (అమితాబ్ బచ్చన్), కాశీలో ఉంటూ కేవలం కాంప్లెక్స్‌లోకి అడుగుపెట్టడమే లక్ష్యంగా బౌంటీలు వేటాడే భైరవ (ప్రభాస్) పాత్రల ద్వారా ఈ నగరాల మధ్య లంకెను కుదిర్చారు. టెక్నాలజీ పరంగా, జీవన విధానం పరంగా ఎక్కడా పొంతన లేని ఈ మూడు భిన్న లోకాలను కలియుగాంతంలో ధర్మ స్థాపన కోసం సాగే ఒకే పోరాటంలో భాగం చేసి నాగ్ అశ్విన్ భారతీయ వెండితెరపై ఒక అపూర్వమైన సినిమాటిక్ యూనివర్స్‌ను ఆవిష్కరించారు. ఇది హాలీవుడ్‌లో వచ్చిన అవెంజర్స్ ప్రపంచాలను లేదా బ్లాక్ పాంథర్ ప్రపంచాల స్ఫూర్తి నుంచి పుట్టిన భారతీయ నేటివిటీ కథగానే చూడాలి. అందుకే ఇప్పుడు వరుణ్ ధావన్ చేస్తున్న హాలీవుడ్ ప్రయత్నం కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అతడు కూడా విభిన్న ప్రపంచాల కలయికతో రన్ అయ్యే ఒక కొత్త ప్రపంచంలో నివశించే యువకుడిగా కనిపించబోతున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ హాలీవుడ్ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలు సాగుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళితే...

**వరుణ్ ధావన్ హాలీవుడ్ ఎంట్రీ - సరికొత్త సినిమాటిక్ ప్రపంచంలోకి**

బాలీవుడ్ యువ హీరో వరుణ్ ధావన్ కెరీర్ సరికొత్త మలుపు తిరగబోతోంది. ఒకవైపు తన తండ్రి, ప్రముఖ దర్శకుడు డేవిడ్ ధావన్ దర్శకత్వంలో హై జవానీతో ఇష్క్ హోనా హై రిలీజ్ ప్రచారంలో ఉన్న ధావన్ మరోవైపు భారీ హాలీవుడ్ ప్రాజెక్ట్ కోసం చర్చలు జరుపుతున్నారు. ప్రముఖ హాలీవుడ్ నిర్మాత లారెన్స్ కసనాఫ్ నిర్మించనున్న ఒక అంతర్జాతీయ చిత్రంలో ప్రధాన పాత్ర కోసం సంప్రదింపులు ముగిసాయని సమాచారం. పింక్‌విల్లా కథనం ప్రకారం.. గత కొన్ని వారాలుగా వరుణ్ ధావన్ - లారెన్స్ కసనాఫ్ బృందం మధ్య ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు నిరంతరాయంగా సాగుతూ ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ గనుక అధికారికంగా ఖరారైతే.. వరుణ్ ధావన్ గ్లోబల్ కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. ఇది భారతీయ వెండితెరపై సంచలనం సృష్టించిన కల్కి 2898 ఏడి తరహాలోనే సరికొత్త మల్టీ-వర్స్ లేదా విభిన్న ప్రపంచాల నేపథ్యంలో సాగే మినీ అవెంజర్స్ తరహా ప్రాజెక్ట్ కావడం విశేషం.

ఇది ఇంటర్-పారలల్ యూనివర్స్ యాక్షన్ (సమాంతర విశ్వాల నేపథ్యంలో సాగే యాక్షన్) జోనర్‌లో తెరకెక్కనుందని సమాచారం. దర్శకుడు నాగ్ అశ్విన్ కల్కి చిత్రంలో కాశీ, కాంప్లెక్స్, శంబల వంటి విభిన్న లోకాలను సృష్టించి ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లినట్లు గానే ఈ హాలీవుడ్ చిత్రం కూడా పారలల్ యూనివర్స్ కాన్సెప్ట్‌తో సరికొత్త సినిమాటిక్ అనుభూతిని ఇవ్వబోతోంది. ఇప్పటి వరకు బాలీవుడ్‌లో ఇలాంటి విభిన్నమైన, క్లిష్టమైన జోనర్‌ను పెద్దగా ప్రయత్నించలేదు. కాబట్టి ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కితే వరుణ్ ధావన్ మునుపెన్నడూ చూడని సరికొత్త హై-టెక్నిక్ యాక్షన్ అవతారంలో గ్లోబల్ ఆడియన్స్‌ను అలరించడం ఖాయంగా కనిపిస్తోంది.

# అఖిల్ 'లెనిన్'.. అసలు సౌండ్ లేదేంటి?




అక్కినేని హీరో అఖిల్ కెరీర్‌లో ప్రస్తుతం లెనిన్ సినిమా కీలకమన్న విషయం తెలిసిందే. హీరోగా ఎంట్రీ ఇచ్చి దాదాపు పదేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు అఖిల్ కు కంప్లీట్ కమర్షియల్ హిట్ మాత్రం దక్కలేదు. ప్రతి సినిమాతో కొత్త ప్రయత్నం చేస్తున్నా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఈసారి మాత్రం మాస్ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ లెనిన్ తో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. ఏజెంట్ తర్వాత అఖిల్ గ్యాప్ తీసుకోవడం కూడా లెనిన్ మూవీపై ఆసక్తి పెంచింది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఆ చిత్రం మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందుతోంది. ఇందులో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా యాక్ట్ చేస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్టైన్మెంట్స్ సంస్థలు కలిసి గ్రాండ్‌గా నిర్మిస్తున్నాయి. నిర్మాతలుగా నాగార్జున, నాగవంశీ వ్యవహరిస్తుండగా, తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమా కోసం అఖిల్ తన లుక్‌ను కంప్లీట్‌గా మార్చుకున్నట్లు కొన్ని రోజులుగా టాక్ వినిపిస్తోంది. మాస్ బాడీ లాంగ్వేజ్‌తో పాటు యాక్షన్ ఎపిసోడ్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. అందుకే అభిమానులు కూడా సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ముఖ్యంగా మాస్ ఇమేజ్ కోసం అఖిల్ చేస్తున్న ప్రయత్నం ఎలా ఉండబోతుందన్న ఆసక్తి నెలకొంది. మొదట సినిమాను మే 1న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే అదే సమయంలో రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పెద్ది విడుదల తేదీ ఏప్రిల్ 30గా ప్రకటించడంతో పోటీని తప్పించుకునేందుకు లెనిన్ విడుదలను వాయిదా వేశారు. తర్వాత పెద్ది కూడా జూన్ 4కు మారడంతో లెనిన్ ను జూన్ 26న విడుదల చేయాలని ఫిక్స్ చేశారు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్న ప్రశ్న మాత్రం ఒక్కటే. అసలు లెనిన్ సౌండ్ ఎక్కడ? అని అభిమానులు ప్రశ్నిస్తున్నారు. రిలీజ్ కు పెద్దగా సమయం లేకపోయినా ఇప్పటివరకు సరైన ప్రమోషన్స్ కనిపించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా సినిమాలకు విడుదలకు రెండు మూడు నెలల ముందే గ్లింప్స్, టీజర్లు, పాటలు, పోస్టర్లతో హైప్ పెంచే ప్రయత్నం జరుగుతుంది. కానీ లెనిన్ విషయంలో మాత్రం ఇంకా ఆ స్థాయి సందడి కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం షూటింగ్ ఇంకా కొనసాగుతుండటమేనని సమాచారం. కొన్ని కీలక యాక్షన్ సన్నివేశాలతో పాటు పాటల చిత్రీకరణ పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ప్రమోషన్స్‌ను మేకర్స్ ఆలస్యం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. కానీ ఇదే పరిస్థితి కొనసాగితే సినిమాపై ఉన్న ప్రారంభ హైప్ తగ్గిపోయే ప్రమాదం ఉందని చెప్పాలి. మరోవైపు అఖిల్ అభిమానులు మాత్రం త్వరగా అప్డేట్స్ ఇవ్వాలని సోషల్ మీడియాలో డిమాండ్ చేస్తున్నారు. కనీసం టీజర్ లేదా గ్లింప్స్ విడుదల చేస్తే సినిమాపై మళ్లీ బజ్ పెరుగుతుందని భావిస్తున్నారు. ఎందుకంటే ప్రస్తుతం పోటీ కూడా గట్టిగానే ఉంది. పెద్ద సినిమాలు వరుసగా విడుదలకు సిద్ధమవుతున్న సమయంలో లెనిన్ తన ప్రత్యేకతను చూపించాల్సిన అవసరం ఉంది. మరి మేకర్స్ త్వరలో ప్రమోషన్స్ మొదలుపెట్టి సినిమాపై హైప్‌ను మళ్లీ పెంచుతారా? అఖిల్‌కు సినిమా నిజంగా మాస్ బ్రేక్ ఇస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# రాజకీయ చైతన్యానికి మారుపేరు సౌత్ మోపూరు గ్రామం

**- ఎన్నికల వరకే రాజకీయాలు : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రూరల్ సౌత్ మోపూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కర్మక్రతువుల భవనాన్ని జెడ్పీ ఛైర్పర్సన్ ఆనం అరుణమ్మతో కలసి ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. గత 12 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నా ఎక్కడా తగాదాలు ప్రోత్సహించలేదు. సౌత్ మోపూరు గ్రామ ప్రజలు తగాదాలకు పోకుండా ఒక కుటుంబ వాతావరణంలో ఉండాలి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. సౌత్ మోపూరు గ్రామంలో ఇంకా అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతాం.

రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ప్రజల సౌకర్యార్థం సౌత్ మోపూరు గ్రామంలో కర్మక్రతువుల భవనాన్ని నిర్మించాం. జెడ్పీ ఛైర్పర్సన్ ఆనం అరుణమ్మ. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు మరియు సౌత్ మోపూరు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్థంతి వేడుకలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు భారతదేశ మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని ఘనంగా స్థానిక ఇందిరా భవన్‌నందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని కమ్యూనికేషన్ సాంకేతిక పురోభివృద్ధికై బాటలు వేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని, ఓటు వయసును 18 సంవత్సరాలకు తగ్గించి, స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించిన మహనీయుడు దేశం కోసం నిస్వార్థంగా పాటుపడిన రాజీవ్ గాంధీ తీవ్రవాదుల చేతిలో దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ప్రధాని విదేశాలలో జోకర్ లాగా కార్టూన్లు వేస్తున్నారని వాపోయారు. జిల్లాలో మద్యం ఏరులై పారుతుందని మద్యం మీద నెలకు 8 కోట్ల దోపిడీ జరుగుతుందని, పాలకులు అధికారుల మీద మద్యం టార్గెట్లు విధించి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని అన్నారు. కృష్ణ నికర జలాలలో నెల్లూరు రైతుల వాటా సున్నా అని ఈ విషయమై వైసీపీ నోరు మెదపడం లేదని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిటీ అధ్యక్షుడు ఇర్ఫాన్, జిల్లా ఉపాధ్యక్షుడు బాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి కే సంజయ్ కుమార్, మైనార్టీ నాయకులు అల్లావుద్దీన్, కిషోర్, రూరల్ మల్లికార్జున్ రెడ్డి, బద్రి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు

# తెలుగు ప్రజల పండుగ - మహానాడు విజయవంతం చేద్దాం

**- ఏ పి ఈ ఎం సి ఎల్ చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి**





**తంబళ్లపల్లి, (రాజధాని వార్తలు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఇంధన పొదుపు పాటిస్తూ ఆదర్శంగా నిలవాలని సంకల్పించిన మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహానాడు పండుగను ప్రతి నియోజకవర్గంలో క్లస్టర్ వారీగా డిజిటల్ పద్ధతిలో హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం ఎంతో అభినందనీయం అని రాష్ట్ర ఏ పి ఈ ఎం సి ఎల్ చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. దేశ ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఒక ఆదర్శంగా నిలవాలని బాబు తీసుకున్న ఈ నిర్ణయానికి అనుగుణంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఈ నెల 27, 28 తేదీలలో వర్చువల్‌గా నిర్వహించనున్న మహానాడు కార్యక్రమం విజయవంతం కోసం ఈ రోజు హార్సిలీ హిల్స్ కన్వెన్షన్ హాల్‌లో మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ మరియు బూత్ ఇంచార్జీలు, అలాగే నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించామని అన్నారు.

ఈ సందర్భంగా ప్రతి క్లస్టర్‌లోని నాయకులు సమన్వయంతో పని చేసి మహానాడు కార్యక్రమాన్ని ఘనవిజ యవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొని మార్గదర్శకాలు అందించారు.

# చెరువులు అభివృద్ధికి రూ. 20 కోట్లు నిధులు మంజూరు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గోనుపల్లి గ్రామంలో జరిగిన పల్లె వీక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని త్రాగు నీరు, రోడ్లు, డ్రైనేజ్ సమస్యలు తీరుస్తున్నామని వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు, కలువాయి, సైదాపురం మూడు మండలాల్లో చెరువులు అభివృద్ధి కి 20 కోట్ల రూపాయలు నిధులు జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేశారని స్థానిక ప్రజా సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని కొన్ని ప్రభుత్వం



ద్వారా కూడా పరిష్కరిస్తామనీ ఎన్నికలకు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని ప్రతి గ్రామంలోనూ సమస్యల పరిష్కరిస్తామని వెంకటగిరి ఎమ్మెల్యే కోరుకొండ రామకృష్ణ తెలిపారు.

# బక్రీద్ పండుగ నేపథ్యంలో మూగజీవాల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ వధింపులపై నెల్లూరు జిల్లా పోలీసుల ప్రత్యేక నిఘా



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాబోవు బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో ఎటువంటి మూగజీవాల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ వధింపులు జరగకుండా నెల్లూరు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్ల తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు. అనుమతులు పొందిన స్లాటర్ హౌస్‌లు, వాటి నోడల్ అధికారులు, పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ శాఖ మరియు ఇతర సంబంధిత విభాగాలతో సమన్వయ సమావేశాలు నిర్వహించుట మరియు చట్టబద్ధ చర్యల అమలుపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. మూగజీవాల అక్రమ రవాణా, చట్టవిరుద్ధ వధింపులకు సంబంధించిన కేసుల్లో గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారికి నోటీసులు జారీ చేయడంతో పాటు బౌండ్ ఓవర్ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలు, చెక్‌పోస్టులు, ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని, అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా మూగజీవాలను తరలించడం, అనుమతులు లేకుండా రవాణా చేయడం, జంతు హింసకు పాల్పడడం లేదా నిబంధనలు ఉల్లంఘించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, కోర్టు మార్గదర్శకాలు మరియు జంతు సంరక్షణ చట్టాలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అవసరమైతే వాహనాల స్వాధీనం, అరెస్టులు, క్రిమినల్ కేసుల నమోదు వంటి చర్యలు కూడా అమలు చేస్తామని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు, సామాజిక సామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తించినా వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి, అనుమానాస్పద రవాణా లేదా అక్రమ కార్యకలాపాలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# గోనుపల్లిలో జలజీవన్ కింద ఏడు చెరువులకు మరమ్మతులకు చర్యలు

**- పల్లె వీక్షణలో ఎమ్మెల్యే కురుగొండ్లతో కలసి కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలన**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా రాపూరు మండలం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్య క్రమంలో వచ్చిన అర్జీలను ఈ రోజే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. గురువారం పల్లె వీక్షణం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ హిమాన్షు శుక్ల వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండల రామకృష్ణతో కలిసి విబి జిఆర్‌ఎఎంజి పనులు పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ ద్వారా సిసి రోడ్ల పరిశీలన, మంచినీటి సరఫరా నమూనాలను ప్రత్యేకంగా పరీక్షించి సంతృప్తి చెందారు. స్థానికులుతో ముచ్చటించి పంచాయతీ వారు చెత్తని సేకరిస్తున్నారా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోనుపల్లిలోని అంగన్వాడీ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులలతో ముచ్చటించి వారి నుండి సమాధానాలు రాబట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా సత్కరించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో ఛాంపియన్ రైతులను అభినందించి పలువురికి పిఎండిఎస్‌యు కిట్లను అందచేశారు. సచివాలయం సందర్శించి అక్కడ అందిస్తున్న సేవల గురించి ఆడిగితెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తదుపరి పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ స్థానికులు సూచించిన పలు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గోనుపల్లి గ్రామాన్ని 100 శాతం సిసి రోడ్లతో అభివృద్ధి చేస్తామన్నారు. ఐసిడిఎస్ అంగన్వాడీ ప్రైమరీ స్కూలు బాగా పని చేస్తున్నదని ఆయన కొనియాడారు. మండలంలోని 7 చెరువులను కోటి రూపాయలు జలజీవిని మిషన్ కింద అభివృద్ధి చేస్తామన్నారు. ఘన వ్యర్థాల నుండి సంపద తయారీ కేంద్రం పనితీరు బాగుందని, అక్కడే ఫర్టిలైజర్స్ కూడా తయారు చేస్తున్నారన్నారు. కెమికల్ ఫ్రీ ఎరువులు ఉత్పత్తి అవుతున్నాయి అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఏర్పాటు చేసిన సిసి రోడ్డు నాణ్యత బాగుందని తెలిపారు. ప్రజల కోరిక మేరకు మరో 10 లక్షలు రూపాయలతో సిసి రోడ్ల ఏర్పాటుకు స్థానిక శాసనసభ్యులు ఆమోదించారని వివరించారు. స్థానిక శాసన సభ్యులు కురుగొండ రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాలలో పర్యటించి సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టారని, అందులో భాగంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా రాపూరు మండలం గోనుపల్లి గ్రామానికి రావడం అభినందనీయమని తెలిపారు. గోనుపల్లి అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఏదైనా సమస్యలు వారు తదుపరి అవసరమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. రానున్న కాలంలో అందరికీ సొంత గృహాలను మంజూరు చేస్తామన్నారు. జలజీవన్ మిషన్ కింద పనులు చేపట్టారని, అదేవిధంగా నియోజక వర్గ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ వారు 21 మంజూరు చేశారని, తిరుపతి జిల్లా కలెక్టర్ 20 కోట్లు వెరసి మొత్తం 40 కోట్లు రూపాయలు మంజూరు చేశారని వివరించారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణతో కలిసి డిఆర్డిఏ తరఫున 49 మందికి 7 లక్షల 39 వేల రూపాయలు విలువ చేసే సెల్ఫోన్లను సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి నాగ అనూష, డిపిఓ వసుమతి, డి ఆర్ డి ఎ నాగరాజుకుమారి, జిల్లా వైద్య శాఖ అధికారి సుజాత, మత్స్యశాఖ అధికారి శాంతి మరియు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ చైతన్యానికి మారుపేరు సౌత్ మోపూరు

**- కర్మ క్రతువుల భవనాన్ని జెడ్పీ చైర్ పర్సన్‌తో కలిసి ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాజకీయ చైతన్యానికి మారు పేరు సౌత్ మోపూరు గ్రామమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కర్మక్రతువుల భవనాన్ని గురువారం జెడ్పీ ఛైర్పర్సన్ ఆనం అరుణమ్మతో కలసి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నా ఎక్కడా తగాదాలు ప్రోత్సహించలేదనీ, సౌత్ మోపూరు గ్రామ ప్రజలు తగాదాలకు పోకుండా ఒక కుటుంబ వాతావరణంలో ఉండాలనీ కోరారు. సౌత్ మోపూరు గ్రామంలో ఇంకా అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామన్నారు. ప్రజల సౌకర్యార్థం సౌత్ మోపూరు గ్రామంలో కర్మక్రతువుల భవనాన్ని నిర్మించామని జెడ్పీ ఛైర్పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో



నాయకులు, కార్యకర్తలు, సౌత్ మోపూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఐటీ విభాగ కార్యదర్శిగా నియమితులైన సుధీర్‌కు శుభాకాంక్షలు

**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు మండలం, వేగూరు గ్రామానికి చెందిన పగడాల సుధీర్ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటి విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా వెల్లువెత్తిన వైసీపీ శ్రేణులు వారికి హార్దిక శుభా కాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వాలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి కవరగిరి ప్రసాద్ అదేవిదంగా కోవూరు మండల జడ్పీటీసీ కవరగిరి శ్రీలత, మండలం వైస్ ఎంపీపీ శివుని నరసింహ రెడ్డి వైసీపీ మండలం కన్వీనర్ అత్తిపల్లి అనూప్ రెడ్డిలు సుధీర్‌కు శుభా కాంక్షలను తెలిపారు. పార్టీలో సముచిత స్థానం కల్పనకు కృషి చేసిన మాజీ మంత్రి ప్రసన్న కుమార్ రెడ్డికి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిలకు పలువురు నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ ఆంజనేయపురం గ్రామానికి నూతనంగా కాపులు, పెద్దలు నియామకం

### - గ్రామాభివృద్ధికే కృషి - నూతన కాపులు నియామకంతో హర్షం



**విడవలూరు, (రాజధాని వార్తలు):** తీర ప్రాంతం మత్స్యకార గ్రామాల్లో అనాదిగా నడుస్తున్న గ్రామ కాపులు వ్యవస్థలో భాగంగా శ్రీ ఆంజనేయపురం గ్రామానికి నూతనంగా గ్రామ కాపులను గ్రామ ప్రజలు నియమించుకొన్నారు. ఈ నేపథ్యంలో మొదటి కాపుగా కటారి వెంకటేశ్వర్లు, రెండో కాపుగా కొండూరు రాజా, మూడో కాపుగా ఆవుల యాదగిరిలను నియమించడం జరిగింది. అదేవిదంగా గ్రామ పెద్దలగా, పామంజి నరసింహం, బుచ్చింగారి యాదగిరి, ప్రళయ కావేరి శ్రీరాములు ఆవుల గోవిందు స్వామి బుచ్చింగారి సంజీవలను నియమించుకొన్నారు. గ్రామములో ఆర్థిక వ్యవహారం కార్యదర్శిగా రాజబాబును నియమించారు. స్థానిక రాములు వారి గుడి ప్రాంగణములో కాపులు బాధ్యతలను స్వీకరించడము జరిగింది. ఈ సందర్భంగా కాపులు మాట్లాడుతూ. గ్రామ ములో ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షచించారు. గ్రామాభివృద్ధి కొరకు తమ వంతు తాము కృషి చేస్తామని అన్నారు. గ్రామ ప్రజలు అండతో కాపు వ్యవస్థను చిత్త శుద్ధితో త్రికరణతో ప్రజలకు మేలు చేస్తామని, గ్రామములో ప్రజలు ఐక్యత తో ఉండేందుకు తాము కృషి చేస్తామని అన్నారు. తమపై ఉంచిన బాధ్యతలను నెరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. నూతన కాపులు నియామకముతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేసారు.

## నూతన కాపులను సన్మానం చేసిన బాషా యూత్ ఫౌండేషన్ చైర్మన్ వనమాల జనార్ధన్ రావు

### - గ్రామ ప్రజలు రక్షణకు కాపు వ్యవస్థ ఎంతో మేలు : వనమాల వెల్లడి



**విడవలూరు, (రాజధాని వార్తలు):** గ్రామాల ఐక్యతకు ప్రతీకగా కాపులు వ్యవస్థ ఎంతో మేలు చేస్తుందని బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్ధన్‌రావు అభిప్రాయం వ్యక్తం చేసారు. విడవలూరు మండలంలోని రామతీర్థం పంచాయతీ పరిధిలో గల శ్రీ ఆంజనేయపురం గ్రామానికి నూతనంగా ముగ్గురు కాపులను గ్రామం నియమించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కటారి వెంకటేశ్వర్లు కొండూరు, రాజా, ఆవుల యాదగిరిలను తాను ప్రత్యేకంగా శాలువాతో సత్కరించి వారికి అభినందనలు వనమాల జనార్ధన్‌రావు తెలిపారు. గ్రామాభివృద్ధికి మూల స్తంబాలులాంటి వారు కాపులేనని అన్నారు. అదేవిదంగా పెద్దలకు కూడా అభినందనలు తెలిపారు. చిన్న సమస్యలు పెద్దదిగా ఉత్పన్నము కాకుండా తొలి దశలోనే గ్రామ కాపులు నిర్ణయంతో గ్రామం ప్రశాంతంగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసారు. కాపులు గ్రామంలో ఉన్నందున గ్రామానికి రక్షణ కవచంలాంటి వారు అని మత్స్యకార నేత, దేవస్థానం పాలక మండలి సభ్యులు కటారి సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో స్టానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విడవలూరు నూతన కమిటీ సభ్యులతో మాజీ మంత్రి నల్లపరెడ్డి సమీక్ష





**విడవలూరు, (రాజధాని వార్తలు):** రానున్న రోజుల్లో పార్టీ బలోపేతం కొరకు వైసీపీ కార్యకర్తలతో మాజీ మంత్రి, రాష్ట్ర పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశంలో విడవలూరు మండలంలోని బి.ఎల్. ఏలకు SIR ప్రక్రియపై అవగాహన మరియు పోలింగ్ బూత్ స్థాయిలో బలోపేతం, పార్టీ కార్యక్రమాల అమలు, ప్రజలతో మమేకం కావడం, పార్టీ సిద్ధాంతాలు, రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని నాయకులకు, నూతన కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేసారు. ఈ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు, కోవూరు నియోజకవర్గ పరిశీలకులు. మాజీ ఆఫ్కాఫ్ చైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, వైసీపీ సీనియర్ నాయకులు కొండూరు వెంకట సుబ్బారెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం రూరల్ మండలం అధ్యక్షులు చెర్లో సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలే తన ఊపిరిగా మత్స్యకారులతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి


### - ప్రశాంతమ్మకు జేజేలు కొట్టిన మత్స్యకారులు
### - ఏ ఎమ్మెల్యేకు రాని ఆలోచన ప్రశాంతమ్మకే సాధ్యం



**కోవూరు /ఇందుకూరు పేట /మైపాడు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లాలోని తీర ప్రాంతములో మత్స్యకారులు అధిక సంఖ్యలో ఉన్నారు. సముద్రంను నమ్ముకొని తీరములోనే స్థిరనివాసము ఉంటూ ప్రతి నిత్యం చేపలు వేట సాగిస్తూ జీవిస్తున్న మత్స్యకారులు ఇండ్లకు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెళ్లి వారి జీవన స్థితులను అడిగి తెలుసుకొన్నారు. మత్స్యకార భరోసా కార్యక్రమంలో భాగంగా ఇందుకూరు పేట మండలంలోని మైపాడు కొలిమిట్ట గ్రామాల్లో ఆమె స్వయంగా మత్స్యకారుల కష్టాలను తెలుసుకొని వారితో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యేగా ప్రశాంతమ్మకే దక్కింది. అదృష్టం ఎమ్మెల్యేకే ఉందని చెప్పవచ్చు. ఎలాంటి కల్మషం లేకుండా మత్స్యకారుల మహిళతో కలిసి భోజనం చేసిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రశాంతి రెడ్డి నని చెప్పకు తప్పదు. మత్స్యకారులు అందరూ బాగుండాలని ఎమ్మెల్యే చూపించిన అభిమానం మత్స్య కారులు మరిచి పోలేని పరిస్థితి వచ్చింది. గతములో ఎమ్మెల్యేలు ఇలాంటి చొరవ చూపించిన సందర్భాలు లేవని చెప్పవచ్చు. కాలానుగుణంగా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మత్స్యకారులతో చూపించి న అభిమానం ఎన్నటికీ మరిచి పోయేది కాదని హర్షము వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతములోనే మత్స్యకారులు మహిళా మూర్తి శ్రీహరికోట జయలక్ష్మి జిల్లా జడ్పీ వైస్ చైర్మెన్‌గా ఉండడం ఒక వరమని భావించాలి అని పలువురు నేతలు అన్నారు. ఆమె భర్త శ్రీహరికోట ప్రసాద్ మాజీ ఎంపీటీసీ గా మైపాడు పంచాయతీ కి ఉన్నారు. ఇలా ఈ ప్రాంతములో మత్స్య కారులకు అండగా నిలిచే ఓ మహానేత దాతటీడీపీ నేత దువ్వూరు కళ్యాణ్ రెడ్డి ఉన్నారు. పిలిస్తే వెంటనే స్పందించే గుణం ఆయనకే సాధ్యం. ఇలా ఒక్కసారిగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పర్యటనతో మత్స్యకారులు ఎమ్మెల్యేకు స్థానిక టీడీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల భరోసా పంపిణీ ఆమె చేతులతో పంపిణీ చేసి వేట చేసే నైలాన్ వలను ఆమె భుజాన వేసుకొని తన దైనశైలిలో మత్స్యకారుల పట్ల ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చూపించిన ఆదరణ ఎంతో గొప్పదని పలువురు ఎమ్మెల్యేను కొనియాడారు.

## డాక్టర్ సుధాకర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు






**తంబళ్ల పల్లె, (రాజధాని వార్తలు):** డాక్టర్ సుధాకర్‌ను మృతి చెందిన రోజు ఇదేరోజు గురువారం ఈ సందర్భంగా వారికి ఘన నివాళులును అర్పిస్తున్నట్లు ఏపీ ఈ ఎం సి ఎల్ చైర్మెన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి చెప్పారు.. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం తెట్టు గ్రామంలో రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబుతో కలిసి నియోజకవర్గ, మండల నాయకులతో కలిసి పాల్గొని స్మరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు.

ఈ సందర్భంగా తెట్టు గ్రామంలో డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించాము.

ఒక్క మాస్క్ అడిగితే ఇవ్వడం లేదు అండి” అని చెప్పిన ఆ మాటలు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చైతన్యానికి నాంది పలికాయి. ఆనాడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం దళితులపై దమనకాండ కొనసాగించిన రోజుల్లో, కేవలం ఒక మాస్క్ అడిగినందుకు దళిత మేధావి డాక్టర్ సుధాకర్‌ని పిచ్చివాడిగా చిత్రీకరించి నడిరోడ్డుపై అవమానించడం, హింసించడం వంటి ఘటనలు ఈ రాష్ట్ర ప్రజల మనసుల్లో ఎప్పటికీ చెరిగిపోని ముద్ర వేసాయని అన్నారు. అలాగే ఎంఎల్‌సి అనంతబాబు కేసులో డ్రైవర్ శ్రీకాంత్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటన వైసీపీ పాలనలో జరిగిన దారుణాలకి నిదర్శనం. ఇలాంటి అన్యాయాలపై ప్రజలు ఇప్పటికే తమ తీర్పు ఇచ్చారు. రాబోయే రోజుల్లో కూడా వైసీపీ పార్టీకి ప్రజలు మరింత గట్టిగా బుద్ధి చెపుతారని నేను విశ్వసిస్తున్నాను. ఇదే సమయంలో ప్రజలను, నాయకులను తెలుగుదేశం పార్టీ ఎలా ఆదరిస్తుందో రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారు. ప్రజల పక్షాన నిలబడి, న్యాయం కోసం పోరాడటం మా పార్టీ యొక్క ధ్యేయం. డాక్టర్ సుధాకర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేసారు.

## భానుడు భగ భగ - ప్రజలు అప్రమత్తంగా ఉండండి : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**కోవూరు, (రాజధాని వార్తలు):** ఎన్నడూ లేని విధంగా వాతావరణంలో ఎండ తీవ్రంగా ఉందని ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎండ తాకిడికి ఆరోగ్యం ఒక్కసారిగా దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయని సూచించారు. సూర్యుడు వేడి సాధారణ స్థాయి కంటే అధికంగా ఉన్నందున ఎవరికీ వారు తగిన జాగ్రత్తలను పాటించి ఆరోగ్యంను సంరక్షణ చేసుకోవాలని అన్నారు. కోవూరు నియోజకవర్గంలోని ప్రజలందరికి సూచిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చెప్పారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరం, రంగనాయకుల పేటలోని మాదాల బలతిమ్మయ్య కల్యాణ మండపంలో కోవూరు మండలం, పెద్ద పడుగుపాడు గ్రామానికి చెందిన షేక్ రసూల్ బాషా - షేక్ జాఫరున్నీసా కుమారుడు షేక్ జాఫర్ - నూర్-ఏ-చష్మిల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను మాజీ మంత్రి వైసీపీ రాష్ట్ర పిఏసి సభ్యుల నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి ఆశీర్వదించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు పచ్చిపాల రాధాకృష్ణ రెడ్డి శివుని నరసింహారెడ్డి అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి, కవనగిరి ప్రసాద్ వైసీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.



# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పాస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ఇల్ నెస్ నుంచి వెల్ నెస్ దిశగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వం నుంచి రూ.40 వేల కోట్లు, రూ. 60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు కూడా వస్తాయన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా గ్యాస్ కొరత, పెట్రోలు డీజిల్ ధరలు పెరిగినా... సమస్య తాత్కాలికమేనని అన్నారు. మహిళల కోసం కూటమి సర్కారు తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం 2 లాంటి పథకాలు అమలు చేసిందన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్‌తో పాటు చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

**గొడ్డలి పార్టీ గంగవెర్రులెత్తుతోంది**

రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ కావటంతో పాటు కూటమి చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను చూసి గొడ్డలి పార్టీ గంగవెర్రులెత్తుతోందని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలు కాపాడే రాజకీయాలు ఒకవైపు ప్రజల్ని భయ పెట్టే మోసం చేసే రాజకీయాలు ఇంకోవైపు ఉన్నాయని ప్రజలు జాగ్రత్తగా గమనించాలని అన్నారు. నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్న వ్యక్తులు మీడియా ముందుకొచ్చి మంచోడినంటూ మాటలు చెబుతున్నారని.. ఇది గొడ్డలి పార్టీ నైజమని అన్నారు. వైసీపీ చేసిన 11 నిర్వాకాలను, అరాచక ఘటనలను సీఎం ప్రజలకు వివరించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీలకు చోటులేదని..సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని.. గొడ్డలి పార్టీ నెవర్ ఎగైన్ అంటూ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ అంశాలపై సీఎం మాట్లాడుతూ.. 1.వివేకా హత్యలో నాటకాలు ఆడారు, నంగనాచి కబుర్లు చెప్పారు - అంతిమ లబ్దిదారు ఎవరనేది...ప్రతి ఒక్కరికీ తెలుసు. 2.కోడికత్తి డ్రామా... గులకరాయి డ్రామా ప్రజలందరికీ జ్ఞాపకం ఉంది. ప్రజలను మోసం చేసే ఎత్తుగడ, దుర్మార్గానికి పరాకాష్ట. 3.దళిత డ్రైవర్ సుబ్రమణ్యం హత్య, డోర్ డెలివరీ చేసిన నిందితుడికి అండదండలు ఇచ్చారు. 4.మాస్క్ అడిగిన దళిత డాక్టర్ సుధాకర్ పై పై దాడి చేశారు, వేధించి ప్రాణాలు తీశారు. 5.కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు వేశారు. ఆస్తి ఇవ్వకుండా తల్లికి, చెల్లికి అన్యాయం చేశారు. ఇంట్లో న్యాయం చేయకుండా బయట ఎలా న్యాయం చేస్తాడు. 6. హిందూ దేవుళ్లపై దాడులు చేశారు. అపవిత్ర కార్యక్రమాలు, కుట్రలు. తప్పుడు ప్రచారాలు చేశారు. 7. పోలవరం, అమరావతి, పెట్టుబడులు, అభివృద్ధిపై గొడ్డలి పార్టీ వేటు వేసింది. 8.నందం సుబ్బయ్య, చంద్రయ్య, జల్లయ్యల పీకలు కోసి నడిరోడ్డుపై చంపేసి రక్తదాహం తీర్చుకున్నారు. 9.గంజాయి బ్యాచ్ లకు ప్రోత్సాహం ఇచ్చారు. వాళ్ల కార్యకర్తలు రప్పా రప్పా రంకెలు వేశారు. జంతు రక్తంతో కటౌట్ కు అభిషేకాలు చేశారు. 10. కారు కింద వారి పార్టీ కార్యకర్త సింగయ్యను తొక్కించారు... కడపలో పెద్ద దస్తగిరిని చంపేశారు. 11.కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుకు రోజుకో నాటకం. పాస్టర్లతో దాడి డ్రామాలు చేస్తూనే ఉన్నారు." అని సీఎం వ్యాఖ్యానించారు. 5 ఏళ్ల పాటు రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి నిద్ర లేకుండా చేశారు. ప్రజలకు నరకం చూపించారన్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తనను అరెస్టు చేసి జైల్లో పెట్టారని ఆరోపించారు. ప్రజలందరిలోనూ భయాందోళనలు కల్పించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే స్వేచ్ఛ కల్పించామని సీఎం స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం హెల్తీ వెల్తీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజా వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళి ఇతర ప్రజాప్రతినిధులు, వైద్యారోగ్యశాఖ, చిత్తూరు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాలుష్య రహిత పుష్కరాల నిర్వహణే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

**- డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి నరసింహ కిషోర్**





**రాజమహేంద్రవరం, (రాజధాని వార్తలు):** రానున్న గోదావరి పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి పుష్కర ఘాట్ వద్ద ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పర్యటన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఈనెల 25న రాజమహేంద్రవరంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించినట్లు తెలిపారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో కాలుష్య నిర్మూలన, పుష్కరాల నిర్వహణకు అవసరమైన చర్యలపై డిప్యూటీ సీఎం ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. ఆదివారం రాత్రి ఉపముఖ్యమంత్రి రాజమహేంద్రవరానికి చేరుకోనున్నారని, సోమవారం ఉదయం పుష్కర ఘాట్ నుంచి కోటిలింగాల రేవు వరకు బోటు ద్వారా వివిధ ఘాట్లను పరిశీలించనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే నల్లా ఛానల్‌ను కాలుష్య రహితంగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా పరిశీలించనున్నారని చెప్పారు. అనంతరం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో గోదావరి పుష్కరాల నిర్వహణపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గోదావరి పవిత్ర నది అయినప్పటికీ ప్రస్తుతం కాలుష్య సమస్య తీవ్రమవుతోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటే రాబోయే పుష్కరాలను ఆరోగ్యవంతంగా, పరిశుభ్రంగా నిర్వహించవచ్చన్నారు. రాబోయే ఏడాది కాలాన్ని సద్వినియోగం చేసుకుని శాఖల మధ్య సమన్వయం, ప్రజాప్రతినిధుల సూచనలతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కాలుష్య రహిత పుష్కరాల నిర్వహణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సంచలన నిర్ణయం.. ఆ పదవికి రాజీనామా

**అమరావతి, (రాజధాని వార్తలు):** వైఎస్ఆర్ కడప జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి అందజేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో శనివారం రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తనపై వచ్చిన పలు ఆరోపణలు, నెలకొన్న వివాదాలపై వివరణ ఇచ్చారు. అనంతరం వ్యక్తిగత కారణాలతో విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పవన్‌కు తెలిపారు. కొన్ని రోజులుగా హర్ష వీణ, ఎమ్మెల్యే శ్రీధర్ వ్యవహారం తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. తనను పెళ్లి చేసుకుంటానని శ్రీధర్ మోసం చేశారంటూ ఆమె సోషల్ మీడియా వేదికగా పలు సంచలన వీడియోలు రిలీజ్ చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై కేసు నమోదు కాగా దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు అరవ శ్రీధర్‌పై తాజాగా మరికొన్ని రాజకీయపరమైన ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే నైతిక బాధ్యత వహిస్తూ ప్రభుత్వ విప్ పదవికి ఎమ్మెల్యే శ్రీధర్ రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.



**చిత్తూరు జిల్లాలో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ రిపోర్ట్ ప్రకటించిన అనంతరం జిల్లా ఇంచార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ సహా చిత్తూరు జిల్లా యంత్రాంగంతో గ్రూప్ ఫోటో దిగిన సీఎం చంద్రబాబు నాయుడు.**

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI No: APTEL/2015/66622, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan